మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

సోమవారం 19 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 318

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల విరుచుకుపాటు!

- చమురు టెర్మినళ్లు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యం
- పారిశ్రామిక సంస్థలు, డేటా కేంద్రాలపైనా దాడులు
- మృతి.. ఐదుగురికి గాయాలు
- 1,015 డ్రోన్లను కూల్చివేశామని రష్యా ప్రకటన
- మంటల్లో చమురు నిల్వ కేంద్రాలు
- జపోరిజియాపై రష్యా ప్రతీకార దాడులు
- ఉక్రెయిన్‌లో మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు



కీవ్/మాస్కో

రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టింది. ఆదివారం జరిగిన ఈ దాడుల్లో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించినట్లు నివేదికలు వెల్లడించాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్ చేపట్టిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇదొకటిగా రక్షణ -మిగతా 3 లో

రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. రష్యాలోని చమురు ఎగుమతి టెర్మినళ్లు, ఇంధన నిల్వ కేంద్రాలు, పారిశ్రామిక సంస్థలు, డేటా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ వెయ్యికిపైగా డ్రోన్లతో భారీ వైమానిక దాడి చేపట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. మరోవైపు ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన ప్రతిదాడుల్లో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గాయపడ్డారు. ఇరు దేశాల పరస్పర దాడులతో యుద్ధం మరింత సంక్లిష్టంగా మారుతోంది.




03

## ఈ నెల 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కూటమి డిమాండ్
- పీపుల్ అగైనెస్ట్ సర్' ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపు
- సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్
- తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి
- రైతులు, యువత, కార్మికులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపు
- 'హర్ హాత్ మే తిరంగా' నినాదంతో ఉద్యమం
- కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్ సహా పలువురు నేతలు




03

## భారత్‌దే సిరీస్!

- రెండో టీ20లోనూ జింబాబ్వే చిత్తు
- చెలరేగిన స్మృతి, షెఫాలీ
- విజృంభించిన బౌలర్లు
- 9 వికెట్లతో టీమిండియా ఘన విజయం
- మహిళల పొట్టి సిరీస్

# స్థానిక ఎన్నికల్లో అక్రమాలు

టీడీపీపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు

- నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శ
- పోలీసులు, ఎస్ఈసీ తీరుపై మండిపాటు
- చంద్రబాబుకు ఓటమి భయం
- ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం
- వైసీపీ పోరాటం కొనసాగుతుంది




తాడేపల్లి,

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార టీడీపీ అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ఓటమి భయంతోనే ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు, నామినేషన్లకు మూడు రోజుల గడువు వంటి అంశాల్లో అధికార పార్టీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులు, అక్రమ కేసులు, అరెస్టులు, బెదిరింపులు జరుగుతున్నాయని జగన్ పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ శ్రేణులు గుమిగూడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, తమ పార్టీ అభ్యర్థులను మాత్రం అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పుంగనూరు, తిరుపతి, కడప, రాజంపేట, పులివెందుల, రాయచోటి తదితర ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా ఇబ్బందులు -మిగతా 3 లో



## ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

- చివరి రోజు అభ్యర్థులు, మద్దతుదారులతో కిటకిటలాడిన కార్యాలయాలు
- మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిన నామినేషన్ల గడువు
- దర్శిలో 25 మంది వైసీపీ అభ్యర్థులకు తప్పని నిరాశ
- సమయానికి చేరుకోలేక నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థులు
- టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ నుంచి భారీగా నామినేషన్లు
- నేడు నామినేషన్ల పరిశీలన
- అక్టోబర్ 21 వరకు ఉపసంహరణకు అవకాశం
- అక్టోబర్ 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

అమరావతి, ఏపీ బ్యూరో,

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. గడువు ముగిసే సమయానికి కార్యాలయాల ప్రాంగణాల్లో ఉన్న అభ్యర్థులకు అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. దీంతో మున్సిపల్ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారనుంది.

**దర్శిలో వైసీపీ అభ్యర్థులకు ఇబ్బందులు**

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఇబ్బందికర

-మిగతా 3 లో

## తీవ్ర ఉద్రిక్తంగా ఫ్రాన్స్ నిరసనలు..

- 143 ఏళ్ల నాటి చారిత్రక టౌన్‌హాల్ భవనానికి నిప్పు..!
- పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా ఆందోళనలు
- మోజెస్ టౌన్‌హాల్‌పై ముసుగులు ధరించిన నిరసనకారుల దాడి
- భవనం బయటి భాగంలో మూడింట రెండొంతులు ధ్వంసం
- పారిస్ సహా పలు నగరాలకు విస్తరించిన హింస
- దేశవ్యాప్తంగా 1,200 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడి
- 150 మందికిపైగా పోలీసులకు గాయాలు.. హింసను ఖండించిన మాక్రాన్



03

## ఓట్లు ఘనం...ప్రాధాన్యతే ప్రశ్నార్థకం..!





- చిట్వేలిలో 820 ముస్లిం ఓటర్ల మనోగతం
- రాజకీయ ఉనికిపై యువతలో అసంతృప్తి
- ఎన్నికల వేళేనా గుర్తింపు.. ఆ తర్వాత పట్టించుకునేదెవరు?

**చిట్వేలి (డ్రీమ్ టైమ్స్) అక్టోబర్ 18:**
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం మండల కేంద్రమైన చిట్వేలి రాజకీయాల్లో ముస్లిం ఓటర్ల ప్రాధాన్యతపై చర్చ మొదలైంది. సుమారు 820 ఓట్లు ఉన్నప్పటికీ, రాజకీయంగా తమకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం లభిస్తున్నాయా? అన్న ప్రశ్నలు యువతలో వినిపిస్తున్నాయి. గతంలో స్థానిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ముస్లిం ఓటర్లకు ప్రస్తుతం అదే స్థాయి ప్రాధాన్యత ఉందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**ఓట్లు ఉన్నాయి.. గుర్తింపు ఏదీ?**

ఎన్నికల సమయంలో మద్దతు కోరే రాజకీయ నాయకులు, ఆ తర్వాత సమాజ సమస్యలు, అభివృద్ధి, యువతకు అవకాశాలు, సంక్షేమం వంటి అంశాలపై ఎంతవరకు స్పందిస్తున్నారన్న అసంతృప్తి కొందరు యువకుల్లో వ్యక్తమవుతోంది. ఓట్ల సంఖ్య మాత్రమే కాకుండా, నిర్ణయాత్మక అంశాల్లో భాగస్వామ్యం, రాజకీయ గుర్తింపు కూడా ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు.

**మారుతున్న రాజకీయ సమీకరణాలు**

చిట్వేలులో మారుతున్న రాజకీయ సమీకరణలు అభ్యర్థుల పనితీరు, స్థానిక అభివృద్ధి అంశాలు ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో ముస్లిం ఓటర్లు ఏ దిశగా మొగ్గుచూపుతారు? గత ప్రాధాన్యతను నిలబెట్టుకుంటారా? కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. 820 ఓట్ల బలాన్ని గుర్తించి, సమాజ ఆకాంక్షలకు రాజకీయ పార్టీలు ఎంతవరకు విలువ ఇస్తాయన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

## శ్రీశైలంలో వైభవంగా దసరా సాంస్కృతిక కార్యక్రమాలు












-కూచిపూడి నృత్యం, భ్రామరీ మహాత్త్యంపై ప్రవచనం, గాత్రకచేరితో అలరించిన కళాకారులు

**శ్రీశైలం, అక్టోబర్ 18**

శ్రీశైల దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా ఆదివారం పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై వివిధ కళా ప్రదర్శనలు నిర్వహించగా, శ్రీ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో పలువురు జానపద కళాకారులు తమ సంప్రదాయ కళారూపాలతో భక్తులను అలరించారు.

**నిత్య కళారాధన వేదికపై ఆకట్టుకున్న ప్రదర్శనలు**

నిత్య కళారాధన వేదికపై సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు గుంటూరుకు చెందిన నటరాజ కళా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాత్రి 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు కర్నూలుకు చెందిన డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి భ్రామరీ మహాత్త్యం అంశంపై ప్రవచనం చేశారు. రాత్రి 8.30 గంటల నుంచి విజయవాడకు చెందిన డాక్టర్ సి. మంజుల, వారి బృందం గాత్రకచేరి నిర్వహించారు.

**గ్రామోత్సవంలో సంప్రదాయ కళారూపాల సందడి**

శ్రీ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో భాగంగా నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం, విళక్కు, స్వాగత నృత్యం, కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, త్రిశూలం, జేగంట, కంచుడోలు, తాళాలు, చెక్కభజన, అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత తదితర సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. కన్నడ జానపద కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడంతో పాటు భారతీయ సంప్రదాయ, జానపద కళల వైభవాన్ని చాటిచెప్పాయి.

# దిగిరానున్న క్యాన్సర్ మందుల రేట్లు




**న్యూఢిల్లీ ,డ్రీమ్స్ టైమ్స్**

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధితో పోరాడే వారికి ఊరటకలిగించే విషయం ఇది. క్యాన్సర్ మందుల రేట్లు దిగిరానున్నాయి. నాన్ షెడ్యూల్ విభాగంలోని 137 క్యాన్సర్ మందుల ఎంఆర్‌పీపై దవాఖానలు, డిస్ట్రిబ్యూటర్లు విధించే ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి తగ్గిస్తూ నేషనల్ ఫార్మా ప్రైసింగ్ అథారిటీ నిర్ణయం తీసుకున్నది. ఈ గెజిట్ నోటిఫికేషన్ శనివారం విడుదల అయింది. సవరించిన కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి వస్తాయి. దీంతో ఆయా మందులపై 70శాతం రేట్లు తగ్గనున్నాయి. ఈ నిబంధనలు కేవలం దవాఖానలకే కాకుండా రిటైల్ మెడికల్ షాపులు, ఆన్‌లైన్ ఫార్మసీలతో పాటు అందరికీ వర్తిస్తాయి.

# నకిలీ ఓట్లతో గెలువాలని చూస్తున్న బీజేపీ

**-ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు**



**లక్నో: ,డ్రీమ్స్ టైమ్స్**

ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లను చేర్చడంతో పాటు ప్రతిపక్షాల మద్దతుదారుల ఓట్లను తొలగించి బీజేపీ గెలువాలని చూస్తున్నదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అఖిలేశ్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నకిలీ ఓట్లను చేర్చి, మన పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించి గెలిచేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నది. కాబట్టి పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ ఓట్లు కనిపిస్తే వెంటనే తొలగించేలా ఫిర్యాదులు చేయాలి' అని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)ను సీఈసీ ప్రకటించిన కొద్ది రోజులకే అఖిలేశ్ ఈ ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# భక్తులపైకి ట్రక్కు.. 15 మంది మృతి

**41 మందికి తీవ్ర గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన**



**భోపాల్ ,డ్రీమ్స్ టైమ్స్**

భక్తులపైకి ఓ ట్రక్కు దూసుకెళ్లడంతో 15 మంది మృతి చెందారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రాంతంలోని శీతలామాత ఆలయం వద్ద దర్శనంకోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఛినోర్ నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి భక్తుల మీదికి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. 41 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. గాయాలైన వారిని స్థానిక దవాఖానలకు తరలించారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇందులో కొందరికి ఎముకలు విరిగాయని తెలుస్తున్నది. ఆంక్షలు ఉన్న చోటకు ట్రక్కు ఎలా దూసుకొచ్చిందనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ఇమ్రాన్ ఖాన్‌కు మరోసారి నోటీసులు

**ముంబై ,డ్రీమ్స్ టైమ్స్**



బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబైలోని విదేశీయుల ప్రాంతీయ కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్వో) మరోసారి నోటీసులు జారీ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనల్లో పాల్గొన్నందుకు అక్టోబర్ 28లోపు దేశం విడిచి వెళ్లాలని ఇప్పటికే ఎఫ్ఆర్ఆర్వో నోటీసులు ఇచ్చింది. తాజా నోటీసుల్లో.. ఇమ్రాన్ ఖాన్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను ఎందుకు రద్దు చేయకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించింది. దీనిపై ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటి వరకు స్పందించలేదు.

# ప్రపంచమంతా 'జంతర్ మంతర్'!

**-సర్‌కు వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రవాస భారతీయుల నిరసనలు**

**-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**

**న్యూఢిల్లీ ,డ్రీమ్స్ టైమ్స్**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా భారత్‌లో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత, ఓటు హక్కు కోసం 'ప్రతి చోటా జంతర్‌మంతర్' పేరిట వివిధ దేశాల్లో వీధుల్లోకి వచ్చారు. అక్టోబర్ 16న లండన్, జర్మనీలోని ఎర్లాంగెస్‌లో ప్రారంభమైన నిరసనలు మరుసటి రోజు జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్వీడన్, ఫిన్‌లాండ్, కెనడా, అమెరికా, చెక్ రిపబ్లిక్‌లోని పలు నగరాలకు విస్తరించాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, బ్రిస్బేన్‌తోపాటు న్యూయార్క్‌లోనూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.



**లండన్‌లో భారత హైకమిషన్ ఎదుట..**

స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లోని భారత హైకమిషన్ ఎదుట నిరసన ప్రదర్శన జరిగింది. ఎన్నికల సమగ్రత కాపాడాలని, సీఈసీ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ స్క్వేర్‌లో జరిగిన మరో ప్రదర్శనలో యూట్యూబర్ ధ్రువ్‌పాల్గొన్నారు.

**కెనడా, ఐర్లాండ్‌లో సంఘీభావం**

టొరంటోలోని భారత కాన్సులేట్ ఎదుట నిరసనకారులు భారత రాజ్యాంగాన్ని చదివి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నినాదాలు చేశారు. వాంకోవర్‌లోనూ సుమారు 50 మంది సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. డబ్లిన్‌లో సౌత్ ఏషియా కలెక్టివ్ ఐర్లాండ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల పేర్ల తొలగింపు, వివరాల్లో మార్పులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఓటు హక్కు కాపాడాలని డిమాండ్ చేశారు.

**అమెరికా, నెదర్లాండ్స్‌లోనూ ప్రదర్శనలు**

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుట 150 మందికిపైగా సమావేశమై భారత్‌లో నిరసన చేస్తున్నవారికి మద్దతు తెలిపారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా, లాస్ ఏంజెలెస్ తదితర నగరాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. న్యూయార్క్‌లో జర్నలిస్టులు, రచయితలు, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొని సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

# చైనా ఏజెంట్లకు సున్నిత సమాచారం..

**- సైనికాధికారి భార్యపై ఎఫ్ఐఆర్**




**శ్రీనగర్ :,డ్రీమ్స్ టైమ్స్**

విద్యావేత్తల ముసుగులో ఉన్న చైనా నిఘా ఏజెంట్లతో దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం పంచుకొన్నందుకు సీనియర్ సైనికాధికారి భార్యపై జమ్ము కశ్మీర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తెలంగాణకు చెందిన నిందితురాలు ప్రస్తుతం జమ్ములో నివసిస్తున్నారు. అయితే తనను సంప్రదించినవారు చైనా నిఘా వర్గాలకు చెందినవారన్న విషయాన్ని గ్రహించలేక ఆమె వారితో సమాచారాన్ని పంచుకొన్నట్టు తెలిసింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. చైనా నిఘా ఏజెంట్లు విద్యావేత్తల్లా నటించి సైనికాధికారి భార్యను వ్యూహాత్మక, ఆపరేషనల్ అంశాలపై వ్యాసాలు రాయాల్సిందిగా కోరారు. తొలుత వారు పర్యావరణం, రాజకీయాలపై భౌగోళిక అంశాల ప్రభావం గురించి వ్యాసాలు రాయమని కోరారు. ఆ తర్వాత రక్షణ అంశాలపై వ్యాసాలు రాసేలా ఆమెను మళ్లించారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన డాటాను ఇతరులకు చేరవేయడంలో ఆమె ప్రమేయం ఉందన్న విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆమెపై నిఘా పెట్టారు.

# సర్'లో ఓటు కోల్పోతే ఫామ్-6తో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

**ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం**




**న్యూఢిల్లీ: ,డ్రీమ్స్ టైమ్స్**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో పేర్లు తొలగించబడినవారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈసీ ఈ విషయం వెల్లడించింది. తాము చిరునామా మారడంతో గణన ప్రక్రియలో పాల్గొనలేకపోయామని, అందువల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించాలనే నిబంధనకు బదులుగా, పాత పేర్లను పునరుద్ధరించేందుకు ఫామ్-8 ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. అయితే, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం ఫామ్-6ని సమర్పించి, సమస్యను పరిష్కరించుకోవచ్చని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఎన్నికల నమోదు అధికారి కూడా అవసరమైన సహాయం అందిస్తారని తెలిపారు.

# సీజేపీకి వ్యతిరేకంగా.. 'లాల్ హిట్ జనతా పార్టీ' ఏర్పాటు

**న్యూఢిల్లీ ,డ్రీమ్స్ టైమ్స్**

: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి వ్యతిరేకంగా మరో వేదిక ఏర్పడింది. లాల్ హిట్ జనతా పార్టీ (ఎల్జేపీ) పేరుతో కొత్త సమూహం లాంచ్ అయ్యింది. ఆదివారం ఢిల్లీలోని మాల్వియ స్మృతి భవన్‌లో మొదటి సభ్యత్వ సమావేశాన్ని నిర్వహించింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో 'లాల్ హిట్ జనతా పార్టీ'ని ఏర్పాటు చేసినట్లు దాని అధినేత అయాన్ భట్నాగర్ తెలిపారు. సీజేపీ, కాంగ్రెస్, నిరసనకారులను ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. వారి నిరసన ప్రదర్శనలు దేశ రాజ్యాంగ సంస్థలను ప్రశ్నించాయని, వ్యాపారాలకు తీవ్ర నష్టం కలిగించాయని ఆయన ఆరోపించారు. కాగా, తమ బృందం భవిష్యత్ వ్యూహాన్ని నిర్ణయించడానికి, తక్కువ సమయంలోనే పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించగలమని నిరూపించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అయాన్ భట్నాగర్ తెలిపారు. ప్రధాని మోదీ జన సమీకరణకు పిలుపునిస్తే ఎంత మంది గుమిగూడతారోనని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దసరా పండుగ అత్యంత కీలకమైన వ్యాపార సీజన్ అని అన్నారు. ఢిల్లీతో సహా పలు మహానగరాల్లో నిరసనకారులు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో అంతరాయాలను





సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు సోషల్ మీడియాకే పరిమితం కాకుండా సీజేపీ, కాంగ్రెస్ నిరసనలకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మరోవైపు 'ప్రభుత్వ మార్పు' గురించి న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలను భట్నాగర్ ఖండించారు. ఈ నిరసనలు ప్రభుత్వ మార్పును ఎలా తీసుకువస్తాయని ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడం రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. ఈ రోజు సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తుంటే, రేపు ప్రధాని మోదీ రాజీనామా డిమాండ్ కూడా రావచ్చని అన్నారు. కేవలం 50,000 మంది ప్రజలు గుమిగూడారన్న కారణంతో ఒక వర్గం డిమాండ్లను అంగీకరించలేమని ఆయన అన్నారు. అలాగే సీజేపీ చేపడుతున్న నిరసనలు పోలీసు వ్యవస్థ, ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే ఉద్దేశంతోనే జరుగుతున్నాయని భట్నాగర్ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, తమ సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నుంచి సీజేపీకి మద్దతు లభిస్తోందని ఆయన విమర్శించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' అంతం దసరా రోజున మొదలవుతుందని భట్నాగర్ హెచ్చరించారు. చెడుపై మంచి సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు.

# వీధి వ్యాపారుల కోసం సౌర శక్తి బండి

**ఆవిష్కరించిన ఐఐటీ ఖరగ్‌పూర్**

**ఖరగ్‌పూర్,డ్రీమ్స్ టైమ్స్**

డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కలిగిన సౌర శక్తితో నడిచే ఆహార విక్రయ బండిని ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసింది. ప్రభుత్వ స్థలాలను శాశ్వతంగా ఆక్రమించకుండా ఈ బండిని వ్యాపారులు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి నడుపుతూ వివిధ వినియోగదారుల బృందాలకు సేవలందించవచ్చు. మూడు చక్రాలు కలిగిన ఈ బండిని శుక్రవారం సంస్థ క్యాంపస్‌లో ప్రారంభించిన




'నగర ఉద్యమం -- వీధి వ్యాపారి నుంచి చురుకైన పారిశ్రామికవేత్త వరకు' కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ బండిలో ఉత్పత్తులను బాగా ప్రదర్శించే సదుపాయం, మూడు మార్గాల్లో చెత్తను వేరు చేసే పద్ధతి ఉంటాయి. తమ సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్టు ఐఐటీ ఖరగ్‌పూర్ సంచాలకులు సుమన్ చక్రవర్తి తెలిపారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం క్షేత్ర స్థాయి పరిష్కారాలకు సాంకేతికతను ఉపయోగించడంలో తమ నిబద్ధతను ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పరీక్షించడం కోసం తమ సేతు క్లౌడ్ కిచెన్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానిస్తామన్నారు.

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
సోమవారం
19-10-2026
Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# ఈ నెల 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్!

-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కూటమి డిమాండ్
-పీపుల్ అగైనెస్ట్ సర్' ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపు
-సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్
-తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి
-జిల్లాలు, మండలాల్లో మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయం
-రైతులు, యువత, కార్మికులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపు
-'హర్ హాత్ మే తిరంగా' నినాదంతో ఉద్యమం
-కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్ సహా పలువురు నేతలు




న్యూఢిల్లీ:
కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్‌లు నిర్వహించనున్నట్లు 'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి ప్రకటించింది. సర్ ప్రక్రియను రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ అన్ని జిల్లాలు, మండలాల పరిధిలో ఈ నిరసనలు చేపట్టాలని కూటమి పిలుపునిచ్చింది. రైతులు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు జెండాలు పట్టుకుని ప్రజామార్చ్‌లో పాల్గొనాలని కోరింది. 'హర్ హాత్ మే తిరంగా.. హర్ గలీ జంతర్‌మంతర్' నినాదాలతో ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తమ డిమాండ్లను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కూటమి వెల్లడించింది.
ఈ కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్, కిసాన్ సభ నాయకుడు కృష్ణ ప్రసాద్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు సాయిబాలాజీ తదితరులు ఉన్నారు. అక్టోబర్ 23న నిర్వహించనున్న ప్రజామార్చ్‌లో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూటమి కోరింది.

## ఏపీలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు

మొదటి తరువాయి



పరిణామం ఎదురైంది. గడువు ముగిసే సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో సుమారు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేక వెనుదిరిగినట్లు సమాచారం. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**నేడు నామినేషన్ల పరిశీలన**

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల బరిలో నిలిచే తుది అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది.
అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం, ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించనున్నాయి.

## స్థానిక ఎన్నికల్లో అక్రమాలు

ఎదురయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధించిందని గుర్తుచేసిన జగన్.. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు

## సాయి ప్రియ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి మహిళల ఆటపాటలు..
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు

బోడుప్పల్,
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ సాయి ప్రియ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి,



సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతూ బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పెద్దమ్మ తల్లి కమిటీ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త ఆకుల కమలాకర్, కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధర్మ, జనరల్ సెక్రటరీ ఆనంద్ కుమార్‌తో పాటు ఎల్లయ్య, దశరథ, నర్సింగరావు, మల్లేష్, యాదగిరి, చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలతో కలిసి సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సిరిసంపదలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల విరుచుకుపాటు!

మొదటి తరువాయి

వర్గాలు పేర్కొన్నాయి.
సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని చమురు ఎగుమతి టెర్మినల్, చమురు నిల్వ కేంద్రాలతోపాటు పలు పారిశ్రామిక, మౌలిక సదుపాయాలను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగినట్లు సమాచారం. ఈ ఘటనల్లో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చమురు నిల్వ కేంద్రాలు మంటల్లో చిక్కుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.
ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ఎదుర్కొన్నాయని రష్యా అధికారులు ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. అయితే, ఈ సంఖ్యతోపాటు దాడుల వల్ల జరిగిన నష్టం, లక్ష్యాలపై ప్రభావానికి సంబంధించిన పూర్తి వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది.
మరోవైపు రష్యా కూడా ఉక్రెయిన్‌పై ప్రతీకార దాడులు చేపట్టింది. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై జరిగిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. ఇరు దేశాలు పరస్పరం దాడులను కొనసాగిస్తుండటంతో పౌరుల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి.
రష్యా క్షిపణి దాడులను ఎదుర్కొనేందుకు అమెరికా కీలక నిఘా సమాచారాన్ని అందించడం తిరిగి ప్రారంభించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యానికి ఈ సహకారం కీలకమని భావిస్తున్నారు. అయితే, అమెరికా సైనిక, నిఘా సహకారంపై గతంలో నెలకొన్న అనిశ్చితి ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపింది.
రష్యా చమురు కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులు కొనసాగుతుండగా, ఉక్రెయిన్ నగరాలపై రష్యా ప్రతిదాడులు తీవ్రతరమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, తాజా పరిణామాలతో సంఘర్షణ మరింత సంక్లిష్టంగా మారుతోంది.

# భారత్‌దే సిరీస్!

-రెండో టీ20లోనూ జింబాబ్వే చిత్తు
-చెలరేగిన స్మృతి, షెఫాలీ
-విజృంభించిన బౌలర్లు
-9 వికెట్లతో టీమిండియా ఘన విజయం
-మహిళల పొట్టి సిరీస్




రాయ్‌పూర్:
స్వదేశంలో జింబాబ్వే మహిళల జట్టుతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత మహిళల జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో బోణీ కొట్టిన టీమిండియా.. ఆదివారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లోనూ అదే జోరు కొనసాగిస్తూ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే అమ్మాయిలు.. భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేశారు. అనంతరం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత అమ్మాయిలు 8.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఊదేశారు. డాషింగ్ ఓపెనర్ షెఫాలీ వర్మ (55; 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్, కెప్టెన్ స్మృతి మంధాన (47 నాటౌట్; 25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా ఆకాశమే హద్దుగా చెలరేగి విజయంలో తనవంతు సహకారం అందించింది. ఆది నుంచే చెలరేగి ఆడిన భారత ఓపెనర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి ఫోర్లు, సిక్సర్లతో పరుగుల వరద పారించారు. ఈ క్రమంలోనే తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన షెఫాలీ కేవలం 24 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో అర్ధ శతకం బాదేసింది. అయితే, తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనంతరం షెఫాలీ మరో భారీ షాట్‌కు ప్రయత్నించి బిజా బౌలింగ్‌లో వెనుతిరిగింది. తర్వాత అనుష్క శర్మ (1 నాటౌట్)తో కలిసి కెప్టెన్ మంధాన (47) అజేయంగా ఉండి ఇంకా 67 బంతులు మిగిలుండగానే 104/1 స్కోరుతో టీమిండియా విజయతీరాలకు చేర్చింది. ధనాధన్ బ్యాటింగ్‌తో మెరుపులు మెరిపించిన షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇక ఇరుజట్ల మధ్య నామమాత్రపు ఆఖరి టీ20 మ్యాచ్ రేపు (మంగళవారం) ఇదే వేదికలో జరగనుంది.

**కలిసికట్టుగా కట్టడి చేశారు..**

అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేను భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెచ్చరించారు. దీంతో పర్యాటక బ్యాటర్లు పోటీపడి మరీ పెవిలియన్‌కు క్యూ కట్టారు. వీరి ధాటికి జింబాబ్వే ఓపెనర్లు కెలిస్ (0), బిజా (7) పరుగులకే పరిమితమయ్యారు. తర్వాత పార్నె మైయర్స్ (9) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయింది. ఈ దశలో చిపో ముగేరి-తిరిపానో (34; 32 బంతుల్లో 5 ఫోర్లు), కెప్టెన్ జోస్ఫినే నకోమో (27 నాటౌట్) జింబాబ్వే ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, కొద్దిసేపట్లోనే మళ్లీ పుంజుకున్న భారత బౌలర్లు.. కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న చిపో ముగేరిను పెవిలియన్‌కు పంపించి ఈ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశారు. తర్వాత అదే జోరు కొనసాగిస్తూ వరుస క్రమంలో వికెట్లు పడగొట్టడంతో చివరికి జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 102/8 స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ జోస్ఫినే నాటౌట్‌గా నిలిచింది. భారత బౌలర్లలో నికి ప్రసాద్ రెండు వికెట్లతో సత్తా చాటగా.. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, నందని శర్మ తలో వికెట్‌తో మెరిశారు.

# తీవ్ర ఉద్రిక్తంగా ఫ్రాన్స్ నిరసనలు..

పారిస్:
ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఆందోళనల సందర్భంగా లిమోజెస్ నగరంలోని చారిత్రక టౌన్‌హాల్ భవనానికి నిప్పుపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. మంటల కారణంగా భవనం భారీగా దెబ్బతిన్నట్లు సమాచారం. దేశ వారసత్వ సంపదకు ఇది తీవ్ర నష్టమని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.
లిమోజెస్ టౌన్‌హాల్ ఫ్రాన్స్‌లో చారిత్రక ప్రాధాన్యం కలిగిన భవనం. దీని నిర్మాణం 1873లో ప్రారంభమై, 1883లో అధికారికంగా ప్రారంభించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు భవనానికి నిప్పుపెట్టడంతో పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట



రెండొంతుల వరకు ధ్వంసమైందని అధికారులు తెలిపారు.
దేశంలో జీవన వ్యయం పెరుగుదలతోపాటు పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది తొలుత శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. అయితే, ఆందోళనలు క్రమంగా హింసాత్మకంగా మారినట్లు సమాచారం. పారిస్‌తోపాటు మార్సెయి, లియోన్, లిల్లే వంటి ప్రధాన నగరాల్లోనూ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో లూటీలు, దహన ఘటనలు చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.
ఈ ఘటనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా సుమారు 1,200 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. హింసను అదుపు చేసే క్రమంలో 150 మందికిపైగా పోలీసులు గాయపడినట్లు పేర్కొన్నారు. నిరసనల సందర్భంగా ప్రభుత్వ, ప్రజా ఆస్తులకు జరిగిన నష్టంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.
చారిత్రక భవనంపై దాడి, పలు నగరాల్లో హింసాత్మక ఘటనలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తీవ్రంగా ఖండించారు. జీవన వ్యయం వంటి సమస్యలపై ప్రజల ఆందోళనలకు, ప్రజా ఆస్తుల ధ్వంసానికి మధ్య తేడా ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిరసనల వెనుక ఉన్న కారణాలు, హింసకు పాల్పడిన వారి బాధ్యతపై తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అరెస్టులతో ఆపలేరు.. వెనక్కి తగ్గేది లేదు!

న్యూఢిల్లీ
అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో తమను భయపెట్టలేరని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.



ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో నిర్వహించ తలపెట్టిన 'లెహ్రాో దో తిరంగా' ర్యాలీకి సంబంధించిన కేసులో శనివారం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో దీప్కే విడుదలయ్యారు. తన సహచర కార్యకర్తలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా విడుదలైన తర్వాత పార్టీ సభ్యులంతా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు.
అక్టోబర్ 14న సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు దీప్కే పేర్కొన్నారు. వారు ఆదివారమే విడుదలవుతారని ఆశిస్తున్నట్లు చెప్పారు.
గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న అరెస్టులు, నిర్బంధాలను పరిశీలిస్తే తమను భయపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్పష్టమవుతోందని దీప్కే ఆరోపించారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

# ఈసారి ఫిబ్రవరి నుంచే వేసవి

మొదటి తరువాయి

ఈ ఏడాది డిసెంబర్ నాటికే ఎల్‌నినో మరింత బలపడవచ్చని, ఫిబ్రవరిలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నట్లు నివేదిక తెలిపింది. మార్చిలో కొన్ని ప్రాంతాల్లో అనూహ్యంగా చలిగాలులు వీచే అవకాశమూ ఉందని పేర్కొంది. వచ్చే ఏడాది శీతాకాలం ప్రారంభంలోనూ ఎల్‌నినో ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నట్లు వివరించింది.

**ఆగస్టులోనూ అధిక ఉష్ణోగ్రతలు**

ఈ ఏడాది ఆగస్టులో దేశ సగటు ఉష్ణోగ్రత 28.01 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, ఇది సాధారణం కంటే 0.67 డిగ్రీలు ఎక్కువని నివేదికలో పేర్కొన్నారు. ఆగస్టులో 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని, ఇది సాధారణ స్థాయి కంటే 16 శాతం తక్కువని వివరించారు. పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం రుతుపవనాల వ్యవస్థపై ప్రభావం చూపి ఉండవచ్చని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.
ఆగస్టులో నాలుగు అల్పపీడనాలు ఏర్పడి దాదాపు 26 రోజులపాటు చురుకుగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం ప్రధానంగా ఇండో--గంగా మైదాన ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక తెలిపింది. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని పేర్కొంది.

**సెప్టెంబర్‌లోనూ తగ్గిన వర్షపాతం**

సెప్టెంబర్‌లోనూ దేశవ్యాప్తంగా వర్షాలు సాధారణ స్థాయికి చేరుకోలేదని నివేదిక వెల్లడించింది. 1971--2020 మధ్య సెప్టెంబర్ నెలలో సగటు వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉండగా, ఈ ఏడాది 141.7 మిల్లీమీటర్లకే పరిమితమైందని తెలిపింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే వర్షపాతం తగ్గినట్లు వివరించింది.
అయితే, ఎల్‌నినో ప్రభావం, వేసవి ప్రారంభ సమయం, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలపై అంచనాలు మారే అవకాశం ఉంటుంది. ప్రాంతాలవారీగా వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చని, రాబోయే నెలల్లో భారత వాతావరణ శాఖ విడుదల చేసే తాజా సూచనలను పరిశీలించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# సంపాదకీయం

## పునర్విభజనతో ఆర్థిక భారం




దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్‌డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్‌డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి

# దేశ సమస్యలకు కారణం ఉద్యోగులా?



ఎన్‌పీఎస్ (నూతన జాతీయ పెన్షన్ విధానం) ప్రపంచ బ్యాంకు రచించిన పెన్షన్ సంస్కరణల్లో భాగంగా వచ్చిన పథకం. దీన్ని భుజాన వేసుకుని మోయడానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ 9-10-2026 నాటి ఆంధ్రజ్యోతి పత్రికలో శాయశక్తులా ప్రయత్నం చేశారు. అందులో భాగంగా పరిపాలన, విద్యారంగం వంటి అంశాలను కూడా చర్చించారు. కానీ ఎన్‌పీఎస్ ద్వారా ఉద్యోగులకు వచ్చే లాభమేందో చెప్పలేదు. ఓపీఎస్ పునరుద్ధరించాలన్న డిమాండ్ మొత్తం సమాజ సమస్యగా చిత్రీకరించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. విషయాన్ని పక్కదారి పట్టించడానికి కృషి చేసినట్టు తెలుస్తున్నది. ఉద్యోగ విరమణ తర్వాత చెల్లించాల్సిన ప్రయోజనాలకు, ఓపీఎస్ అమలు చేయాలనే డిమాండ్‌కు, ప్రజా సమస్యలకు సంబంధమేందో జేపీకే తెలియాలి. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు దేశంలోనే అత్యంత మిగులు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని జేపీ తన వ్యాసంలో పేర్కొన్నారు. ఈ పదేండ్ల కాలంలో ప్రభుత్వం ఖర్చులకు కూడా కష్టపడుతున్నది అని చెప్పుకొచ్చారు. ఆయన వాదన ప్రకారం 2004లోనే ఓపీఎస్ అమలు చేసిన తర్వాత ప్రభుత్వ పరిస్థితి మరింత మెరుగ్గా మారాలి కదా! ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది? పైగా ఖర్చులకు వెతుక్కోవాల్సినటువంటి పరిస్థితి రావడానికి ఉద్యోగులే కారణమనే విధంగా రాశారు. ఈ 12 ఏండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా దుబారా చేసిన విషయం, అనుత్పాదక వ్యయాలు, వ్యవస్థలోని అవినీతి వల్ల ప్రజాధనంపై ఎంత ప్రభావం పడుతున్నదనే విషయం జేపీ చెప్పలేదు. ఉద్యోగులు కనీస ప్రమాణాలతో కూడిన జీవితాన్ని గడపడానికి కావలసిన వేతనాలు అందించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ, యునెస్కో లాంటి సంస్థల సిఫారసులకు అనుగుణంగా వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ఆ విషయాన్ని విస్మరించి సమస్త ఆర్థిక ఇబ్బందులకు ఉద్యోగుల కోరికలే కారణమన్నట్టుగా జేపీ వాదించారు. ఎన్‌పీఎస్ ద్వారా సీపీఎస్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బు ఎక్కడికీ పోదని, ఉద్యోగి చనిపోతే కుటుంబ సభ్యులకు వెళ్తుందని అన్నారు. కానీ రిటైరైన ఎన్‌పీఎస్ ఉద్యోగుల పరిస్థితి భిన్నంగా ఉన్నది. వారికి రూ.1,000-రూ.1,500 మాత్రమే పెన్షన్‌గా వస్తున్నది. ప్రైవేట్ పెట్టుబడిదారుల ద్వారా షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి తద్వారా వచ్చే గ్యారెంటీ లేని లాభాల నుంచి పెన్షన్ చెల్లించడమే 'నూతన పెన్షన్ విధానం'. ఈ విధానానికి మద్దతు పలకడం అంటే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుంచి ప్రతినెలా చందాగా వసూలు అయ్యే నిధులను ప్రైవేట్ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడాన్ని సమర్థించడమే. అంతేకాదు ఈ వాస్తవాలను భయాలుగా చెప్తూ, అందుకు పరిష్కారంగా 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' తెచ్చారంటూ పెట్టుబడిదారీ శక్తులకు జేపీ మద్దతు పలికారు. ఓపీఎస్ విధానం ద్వారా పెన్షన్ చెల్లిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందన్న పెద్దమనిషి, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌లో 50% వేతనాన్ని గ్యారెంటీగా పెన్షన్‌గా చెల్లిస్తే ఆర్థిక పరిస్థితి తలకిందులు కాదా? మరి దాన్ని ఎట్లా సమర్థిస్తారు? పైగా తెలంగాణలో ఓపీఎస్ పునరుద్ధరించకుండా యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. రాష్ట్రంలో పరిపాలన సంతృప్తికరంగా లేకపోవడానికి, పాఠశాల విద్య దిగజారడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓపీఎస్‌ను కోరడమే కారణమని చెప్పడానికి జేపీ తీవ్రంగా ప్రయత్నించినట్టు కనిపిస్తున్నది. సామాన్య ప్రజల పన్నులపై మొసలి కన్నీరు కార్చే జేపీకి దేశాధినేతలు గుప్పెడు మంది పెట్టుబడిదారులైన 43 కార్పొరేట్ కంపెనీలకు రద్దు చేసిన రూ.3.53 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు, లా ట్రిబ్యునల్ రద్దు చేసిన వేల కోట్ల రుణాలు కనిపించలేదా? కార్పొరేట్ సంస్థలకు ఏటా మాఫీ చేసే పన్నుల రాయితీలు చూడటంలేదా? కాంట్రాక్టు పద్ధతుల్లో ఉద్యోగుల నియామకాల ద్వారా ఉద్యోగభద్రత లేకుండా పోయింది. టైమ్ స్కేల్ లేకుండా, పెన్షన్‌లేని పరిస్థితులను ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయి. ఇటువంటి పరిణామాలను సూచించకుండా తెలివిగా ఉద్యోగులంతా ప్రభుత్వాల ఖజానాలోని సొమ్మును కాజేసే దొంగలు అన్నట్టుగా జేపీ చిత్రీకరిస్తున్నారు. నిజానికి నిత్యావసర ధరలు పెరుగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించలేని పరిస్థితుల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలనే డిమాండ్లు ఉద్యోగుల నుంచి సహజంగానే వస్తాయి. దాన్ని తప్పు అని జేపీ వాదిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు పెంచితే, ఇవ్వాల్సిన బకాయిలు ఇస్తే ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థ నడుము విరుగుతుందా? ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అనుత్పాదక ప్రాజెక్టులు, అనవసర ఖర్చులు, అవినీతి వల్ల నడుము విరుగదా? ఇవన్నీ కూడా జేపీ చర్చించాలి కదా! మరి ఈ విషయాల్ని జేపీ ఎందుకు తెలివిగా దాటవేశారు? పాలనలో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేది ఉద్యోగులే అయినప్పటికీ, కావలసిన ప్రణాళికలు రచించడం, అందుకు కావలసిన నిధులను, మౌలిక సదుపాయాలను సమకూర్చడం ప్రభుత్వ బాధ్యత. ఇవేవీ లేకుండా అన్ని అవకతవకలకు ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లే కారణం అన్నట్టు జేపీ వాదించారు. దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులకు, విధానాల అవకతవకలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న డిమాండ్లే కారణమన్నట్టు జేపీ తన వ్యాసంలో వాదించారు.

అమెరికా, ఫ్రాన్స్ లాంటి పాశ్చాత్య దేశాల విధానాలు, అక్కడ ఉద్యోగులకు చెల్లించే పెన్షన్ల గురించి జేపీ వ్యాసంలో ప్రస్తావించారు. అయితే అక్కడ మొత్తంగా ప్రైవేట్ పెట్టుబడిదారుల ఉద్యోగులు ఉంటారని, వారికి ప్రైవేట్ సంస్థలే పెన్షన్లు చెల్లిస్తాయనే విషయం ఆయనకు తెలియదని అనుకోవడంలేదు. మౌలిక విధానాల గురించి గందరగోళపరిచే విధంగా ప్రజలను జేపీ పక్కదారి పట్టిస్తున్నారు.

# మోదీ ట్రాప్ లో కాంగ్రెస్!

యుద్ధరంగానికి వెళ్లేప్పుడు శత్రువు ఎవరో, అతడి వ్యూహం ఏంటో గమనించాలని నానుడి. ఏ రాజకీయ నాయకుడు చెప్పినా వింటాము. "ఇది రాజకీయాల్లో ప్రాథమిక పాఠం అనిపిస్తుంది. నేషనల్ రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీ మాత్రమే, ప్రస్తుతం తన వ్యూహాన్ని నిర్మించడంలో తీవ్రంగా విఫలమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పదేళ్లకాలంలో నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పన్నుతున్న రాజకీయ వ్యూహాలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. ఇన్ని పదుల దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోదీ నిర్దేశించిన రాజకీయ బాటలోనే నడుస్తూ, ఆయన చేసిన ఏ ఛాలెంజ్‌నైనా స్వీకరిస్తున్నట్టు మాత్రమే కనిపిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పటిష్ట నైతిక పునాదిని నిర్మించడంలో, విధానపరమైన స్పష్టత ఇవ్వడంలో తీవ్రంగా విఫలమైంది. ఎన్నికల సందర్భాన్ని కేవలం రోజూ మోదీకి వ్యతిరేకంగా ప్రచారాన్ని నిర్మించడం మాత్రమే పరిమితం చేసుకుంటోంది. అక్కడ కాంగ్రెస్ తన ప్రాథమిక బాధ్యతను విస్మరిస్తోంది. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా పోటీపడటం వికసిస్తుందా లేదా అనే ప్రశ్నకు పార్టీలు మాట్లాడవు కానీ ప్రజాస్వామ్య మూలస్తంభాలైన సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారంటూ చేసే వాదనలు మినహా వేరేది వినపడటం లేదు. జాతీయ ఎన్నికల పునర్విభజన లేదా సమాజంలో మార్పులు తెచ్చేలా పార్టీ ప్రభావం చేసే ఆలోచనాత్మక దృష్టి కాదనే సత్యం మనం పొడిపొడి తెలుసు. తెలంగాణలో అభ్యర్థుల నుంచి పోలింగ్ సిబ్బంది, ఇతర పరిపాలనా యంత్రాంగం, వివిధ పార్టీల ఏజెంట్లు ఐదు శ్రేణులస్థాయిలో ప్రక్రియను నిర్వహిస్తారు. లక్షల సంఖ్యలో ఉండే స్థానికత గల ఇబ్బంది ఏదో ఒక రాజకీయ పార్టీకి కొమ్ము కాస్తున్నారన్లు తేల్చి చెప్పడమో లేదా జీహెచ్‌ఎంసీ లో ఉద్రిక్తత అనడమో ఇది ఎంతవరకు సమంజసం. ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు చేయడమంటే శ్రేణులస్థాయి శ్రమను, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. రాహుల్ గాంధీ ఏ చిన్న విషయాన్ని వదలకుండా, ప్రతీదానికీ సమర్థతను వాడినా దానివలన కాంగ్రెస్‌కు ఏమాత్రం మేలు జరగడం లేదనేది ఇప్పటిదాకా జరిగిన అనుభవం ద్వారా అర్థమవుతోంది. ఆ ట్రాప్‌లో పడిన కాంగ్రెస్, ప్రజా సమస్యలను వదిలేసి, తన రాజకీయాల చుట్టూ తిరుగుతూ కోలుకోలేని దెబ్బతింటూ ఉండటం గమనించవచ్చు. ఈ రకమైన వ్యూహం, దాని వ్యతిరేక ఉద్యమాల వల్ల సామాన్య ప్రజల జీవితంలో ఎలాంటి మార్పూ లేదు. సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా రోడ్లపైన నిరసనలు తెలుపుతున్న ప్రాంతాలను ఆందోళనల కేంద్రాలుగా మార్చడంలో విజయం దక్కడం లేదు. స్థానిక నేతలు,




యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు డిగ్రీ పూర్తయినా సరైన ఉపాధి లేక రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేస్తున్నా ప్రజల ప్రాతినిధ్యం లభించడం లేదు. ఇప్పుడైనా తమ రాజకీయ సందేశాన్ని కాంగ్రెస్ సరిచూసుకోవాల్సి ఉంది. చాలా రకాల ఆరోపణల కారణంగా కాంగ్రెస్ పార్టీపై అత్యున్నత స్థాయిలో అనేక ప్రభావం పడింది. కాంగ్రెస్ పార్టీకి కావలసింది కేవలం ఉన్న ఒకరిద్దరు రాష్ట్రాల్లో తమ వస్తున్న ఈ దుష్ప్రచారాన్ని అడ్డుకోవడమే కాకుండా పోయింది. పార్టీ ఉనికి ఉన్న రోజూ ఏదోకలా స్పందించలేకపోవడం, ఉద్యమం నడిపించలేకపోవడం చూస్తున్నాం. ఏమైనా స్థానాలు గెలుస్తామని హామీ ఇవ్వగలరా? కాంగ్రెస్ పునాదులు భ్రష్టు పట్టిపోవడానికి కారణమైన ఆ ప్రశ్నలకు సమాధానం లేదా? భాజపా బలపడుతున్న తీరు చూస్తుంటే భవిష్యత్తు సరికొత్తగా కనిపిస్తోందని చాలామంది అంటుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రతీ విషయంలోనూ విమర్శలకే పరిమితమైంది. అధినేతల లాజిక్కు, పదే పదే ముగిసిపోయిన కథలనే ప్రస్తావించడం చూస్తుంటే ఏదో పెద్ద పొరపాటు జరుగుతోందన్నది స్పష్టమవుతోంది. గెలుపు రావాలన్నా, కొత్త వ్యూహాలు తీర్చిదిద్దడం ప్రారంభించాలి. తమకు నచ్చినట్లుగా అదే రకమైన ల్యాంగ్వేజ్ ఉపయోగించి ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఈ వ్యూహాల వల్ల లబ్ధి పొందే పరిస్థితి ఉందా లేదో తెలియక, ఉన్నది ఊడుతోంది. సాంప్రదాయ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ వంటి పాత పార్టీకి అనుభవం, బలమైన విధానాలనేవి సొంతంగా లేవా అంటే ఉన్నాయనే చెప్పాలి. కాంగ్రెస్ బలహీనపడటానికి సొంత వ్యూహాత్మక లోపమే కాకుండా ఏ సంస్థనూ వదలకుండా సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నారనేది నిజం. పార్టీ నమూనాలు, ప్రచారాలు ఎంతవరకు ప్రజల కోరికలకి అనుగుణంగా ఉన్నాయో కానీ అనుభవంలో ఉన్నప్పుడు, సుదీర్ఘ పార్టీ చరిత్ర ఉన్న వారు ఎందుకు విఫలమయ్యారు? ఫలితంగా, బీజేపీ పరిపాలన విధానంలోనే మునిగిపోతూ కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని నిరంతరం కోల్పోతుపోయేలా చేసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాల గురించిన మోదీ చేయు వ్యాఖ్యలు... గత సామాజిక సమూహాల వైఖరి భూమిలా ఎలా కరిగిపోతున్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ సామాజిక వర్గం ఈ రోజు కాంగ్రెస్‌తో ఉంది? బీజేపీ ఎప్పుడో కాంగ్రెస్ ఈ దెబ్బతీసిందంటారు. నేతలు లేదా స్థానిక ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్‌ను పూర్తిగా పక్కన పెట్టారు. బీజేపీ సాధించిన అనేకమైన రాజకీయ విజయాలు కాంగ్రెస్‌ను మరింత వెనక్కి నెట్టివేశాయి. మోదీకి కేవలం సీట్లు డ్యామేజ్ ప్రాంతాలు మాత్రమే లక్ష్యంగా ఉంది. ప్రాంతీయ పార్టీలు, కొత్తగా ఆవిర్భవించిన సొంత పార్టీ నేతలు ప్రాంతీయ వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా, ధనిక వర్గాల్లోని ఒక తెగను మాత్రమే ప్రస్తుతం కాంగ్రెస్‌లో మిగిలి ఉన్న ఇద్దరు ముగ్గురు బాగా వాడుకుంటూ, మునుపటిలా ఒకేసారి ఉండే సమాజంలోని మధ్యతరగతి పోయింది. విద్యార్థులు, ఉద్యోగులు బీజేపీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వారైనా సరే, కాంగ్రెస్‌ను ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు బీజేపీ మళ్లీ సవాలు విసురుతుంటే కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే ముచ్చటేస్తోంది! ఎందుకంటే, హిందుత్వ ఆలోచనా విధానంతో లాభపడుతుందా బాబు? అని ఏమైనా నేర్చుకోవడానికి కోరుకుని ఆలోచిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని, అంచనాలను పొల్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమవుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టిలో ఉన్న గందరగోళాలు, రాజకీయ నేతల వ్యూహాలు, రాహుల్ లీడ్ చేసిన సభలలో పోరాటాల నుండి బయటకు రావలసి ఉంది. ప్రశాంత్ కిషోర్! ఎవరికి మిగిలి, మోదీ వేసిన ప్లాట్‌ఫామ్‌పైనే తరువాతి తరం ప్లాన్లు వేశారంటారు. స్థానిక సమస్యలు ఏవి అని లేవనెత్తడం వల్ల ఏ రాజకీయ పార్టీకి ప్రయోజనం ఉండబోవడంలేదు. రాష్ట్రాల పరిధిలోని ప్రజల సమస్యలు: ఉపాధి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, ప్రాంతీయ సంక్షేమం వంటి అంశాలపై విమర్శనాత్మకంగా పోరాడకుండా కేవలం వ్యక్తిగత వైషమ్యాలపై దృష్టి సారిస్తూ కాలం గడిపే కాంగ్రెస్ వ్యూహం వల్ల పార్టీ హోదా చాలా తక్కువ స్థాయికి పడిపోతూ వస్తోంది. యూపీఏ ప్రభుత్వాల రెండో సారి ప్రభుత్వంలో ఉపాధి దృక్పథం ఎలా పెరిగిందో, దాన్ని బేరీజు వేసి లాభం చేసుకునేలా ఒక్క సరికొత్త ప్లాన్ చేస్తే కాంగ్రెస్ పార్టీకి బాగుండేదేమో అనిపిస్తుంది. కానీ దశాబ్దాల తరబడి ఆలోచనల లేమి వల్ల పునాదులు కదిలిపోయాయి. అన్ని జాతీయ బ్యాంకులు విలీనమయ్యాయి. ప్రభుత్వ రంగాన్ని విడదీసి అమ్ముతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే మేల్కొని, తమ వ్యూహాత్మక అంతరాన్ని పూరిస్తే, భవిష్యత్తులో ఐక్యంగా రాజకీయం చేయగలిగితే? సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ బహుముఖమైన, నైతిక నేపథ్యం కలిగిన రాజకీయంలో కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి ప్రజలు ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నారు!

# కొత్తపల్లిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**యాచారం, అక్టోబర్ 18 డ్రీమ్ టైమ్స్**

యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేస్తూ గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకలతో గ్రామంలో సందడి నెలకొనగా, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పాయి. ఇలాంటి పండుగలను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనందంగా ఉందని పలువురు మహిళలు తెలిపారు

# స్థానిక ఎన్నికల నామినేషన్ల గడువు విషయంలో వైసీపీకి చుక్కెదురు...వైసీపీ పిటిషన్‌ను కొట్టి వేసిన హైకోర్టు

**-గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకమని తేల్చిచెప్పిన న్యాయస్థానం**
**-నామినేషన్ల తొలిరోజు హింసాత్మకం**
**-అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని వైసీపీ ఆరోపణలు**
**-ఘర్షణల నేపథ్యంలో ఎంపీ మిథున్ రెడ్డి సహా 70 మందిపై కేసులు**




**అమరావతి, ఏపీ బ్యూరో, డ్రీమ్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో, వైసీపీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే, నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది.

పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు.

ఈ పరిణామాలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి, అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు

# భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అన్నప్రసాద వితరణ

**అన్నప్రసాద వితరణకు దాతగా నిలిచిన ఉమ్మంతలపల్లి సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్**

**చింతపల్లి, అక్టోబర్ 18 డ్రీమ్ టైమ్స్**

చింతపల్లి మండలం ఉమ్మంతలపల్లి గ్రామంలో దుర్గాభవాని అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ స్వయంగా అన్నప్రసాద వితరణకు దాతగా వ్యవహరించి తన భక్తిభావాన్ని, సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

**సర్పంచ్‌గా బాధ్యతలతో పాటు ఆధ్యాత్మిక సేవలోనూ ముందంజ**

గ్రామంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగస్వాములవుతూ అన్నప్రసాద వితరణకు సహకరించడం ద్వారా సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్ భక్తులకు సేవలందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తిభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాల ఎనిమిదో రోజు వేడుకలు






**-మహాగౌరి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు..**
**-నంది వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు**

**శ్రీశైలం,అక్టోబర్ 18డ్రీమ్ టైమ్స్**

శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, జపానుష్ఠానాలు, పారాయణలు నిర్వహించారు. నవదుర్గ అలంకారాల్లో భాగంగా అమ్మవారిని మహాగౌరి స్వరూపంలో అలంకరించి పూజించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్లకు నంది వాహనసేవ నిర్వహించారు.

**అమ్మవారికి విశేష పూజలు**

దసరా మహోత్సవాల ఎనిమిదో రోజు సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరీ, బాలా జపానుష్ఠానాలు, చండీ పారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీ పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు జరిపించారు.సాయంత్రం జపాలు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, రాత్రి 10 గంటలకు కాళరాత్రి పూజలు నిర్వహించేలా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

**మహాగౌరి అలంకారంలో అమ్మవారు**

నవదుర్గ అలంకారాల్లో భాగంగా ఎనిమిదో రోజున శ్రీ అమ్మవారిని మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. నవదుర్గలలో ఎనిమిదవ రూపమైన మహాగౌరి శాంతి, పవిత్రతలకు ప్రతీకగా పూజలందుకుంటారని ఆధ్యాత్మిక సంప్రదాయం పేర్కొంటోంది. మహాగౌరి దేవి తెల్లని వస్త్రాలను ధరించి, నాలుగు చేతులతో త్రిశూలం, డమరుకం ధరించి, అభయముద్ర, వరముద్రలను కలిగి ఉంటుందని పురాణాలు వివరిస్తున్నాయి. పార్వతీదేవి పరమశివుని కోసం కఠోర తపస్సు చేయగా, ఆమె తపస్సుకు ప్రసన్నుడైన శివుడు గంగాజలంతో ఆమెకు తేజోవంతమైన గౌరవర్ణాన్ని ప్రసాదించాడని పురాణగాథ చెబుతోంది. అందువల్ల ఆమె మహాగౌరిగా ప్రసిద్ధి చెందిందని భక్తుల విశ్వాసం.

**నవరాత్రుల్లో కుమారీ పూజకు విశిష్ట స్థానం**

దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ కుమారీ పూజలు నిర్వహించారు. రెండు నుంచి పది సంవత్సరాల వయస్సు గల బాలికలను దేవీ స్వరూపాలుగా భావించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజించడం ఈ సంప్రదాయంలోని ముఖ్య విశేషం. నవరాత్రి ఉత్సవాల్లో కుమారీ పూజకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది.

**నంది వాహనంపై స్వామి అమ్మవార్ల సేవ**

దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ స్వామి అమ్మవార్లకు నంది వాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి పూజాదికాలు నిర్వహించారు. నంది వాహనసేవను దర్శించుకున్న భక్తులు స్వామి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పించారు. శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా కొనసాగుతూ, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించాయి.

# నంద్యాలలో నామినేషన్లకు పటిష్ట భద్రతా వలయం!






**-80 మంది పోలీసులతో బందోబస్తు.. డ్రోన్లు, సీసీటీవీలతో నిరంతర నిఘా**

**నంద్యాల క్రైమ్। డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 18, 2026.**

నంద్యాల:నంద్యాల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఎస్పీ సుస్మిత ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంది. నంద్యాల మున్సిపాలిటీలోని 52 వార్డులతో పాటు చైర్‌పర్సన్ పదవికి నామినేషన్లు స్వీకరించేందుకు మూడో రోజు, చివరి రోజు కావడంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మొదటి రెండు రోజుల్లో 166 వార్డు సభ్యుల నామినేషన్లతో పాటు, చైర్‌పర్సన్ పదవికి 7 నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. మున్సిపల్ కార్యాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో వాహనాల రాకపోకలను నియంత్రించారు. మొత్తం 80 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించడంతో పాటు, క్విక్ రియాక్షన్ టీమ్స్ ను అందుబాటులో ఉంచారు. వీడియోగ్రఫీ, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. కార్యాలయం లోపల టోకెన్ విధానాన్ని అమలు చేస్తూ, ముందుగా వచ్చిన వారికి ముందుగా అవకాశం కల్పిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సెక్షన్ 144కు సంబంధించి కొత్త చట్టంలోని సెక్షన్ 163 నిబంధనలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ నాయకులు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏఎస్పీ సుస్మిత విజ్ఞప్తి చేశారు. పోలీసులతో అనవసర వాదనలకు దిగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

# విజయపురి కాలనీ ఫేజ్-2లో సద్దుల బతుకమ్మ సంబరాలు

**- సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు..**
**- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, కాలనీవాసులు**



**బోడుప్పల్,అక్టోబర్ 18 డ్రీమ్ టైమ్స్**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేజ్-2లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను కాలనీవాసులందరూ కలిసి నిర్వహించడం ద్వారా పరస్పర స్నేహభావం, ఐకమత్యం మరింత బలపడతాయని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ సామూహిక వేడుకలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాజ్ మోహన్ రెడ్డి, ట్రెజరర్ టీ. రాజేందర్, గౌరవ అధ్యక్షులు పి. భూపాల్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ సీహెచ్. నర్సింహారెడ్డి, ఏ. ప్రతాప్ రెడ్డి, టీ. ప్రసాద్, కాలనీవాసులు వెంకట్ రెడ్డి, అంజిరెడ్డి, బలరాం, నర్సింహ, చారి, ముత్యాలు, చిట్టిరెడ్డి, మహేందర్, హనుమంతరావు, రమేష్‌తో పాటు మహిళలు, యువత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి...జగన్ డిమాండ్

**-స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికారం -యంత్రాంగం విఫలమైందన్న జగన్**

**-ఈసీ ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శ**

**-చంద్రబాబు కనుసన్నల్లో ఈసీ పనిచేస్తోందని ఆరోపణ**



**తాడేపల్లి, అమరావతి, డ్రీమ్ టైమ్స్**
ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ ఖూనీ చేస్తోందని ఆదివారం ఆయన తీవ్రంగా ఆరోపించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయి

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు కనుసన్నల్లోనే రాష్ట్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందని జగన్ విమర్శించారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలు మాటువేసి, వైసీపీ అభ్యర్థులను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేవలం రెండు రోజుల ముందు రిజర్వేషన్లు ప్రకటించి, 24 గంటల్లో నామినేషన్లు వేయమనడం ప్రతిపక్షానికి సమయం ఇవ్వకూడదనే కుట్రలో భాగమేనని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదు

గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎస్‌ఈసీగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉన్నప్పుడు కలెక్టర్లు,ఎస్పీలను బదిలీ చేసినా తాము ధైర్యంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించామని జగన్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదని విమర్శించారు.

పుంగనూరు ఘర్షణలతో మరింత ముదిరిన వివాదం

అన్నమయ్య జిల్లా పుంగనూరు లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయడానికి వెళ్లినప్పుడు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసకు వైసీపీనే కారణమని టీడీపీ ఆరోపిస్తుండగా, తమ ఎంపీపైనే దాడి జరిగిందని వైసీపీ ప్రత్యారోపణలు చేస్తోంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి వందలాది మంది అనుచరులతో రావడం వల్లే ఉద్రిక్తత తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై ఇరు పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ ఆరోపణలపై ఈసీ నివేదికలు కోరినట్లు సమాచారం

# ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**-వైసీపీనే క్షేత్రస్థాయిలో గొడవలు సృష్టిస్తోందని పల్లా ఆరోపణ**

**-జగన్‌పై ఉన్న కేసులను గుర్తు చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు**

**-స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం**



**అమరావతి, ఏపీ బ్యూరో, డ్రీమ్ టైమ్స్**
రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పన్నిన రాజకీయ ఎత్తుగడ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తూ, మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మండిపడ్డారు.

**ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా**

జగన్‌రెడ్డితో పాటు వైసీపీ నేతలపై ఉన్న క్రిమినల్ కేసుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా ఆడుతున్నారని పల్లా ఆరోపించారు. అక్రమాస్తుల కేసులో జగన్‌రెడ్డి 16 నెలల పాటు జైలులో ఉన్న విషయాన్ని, వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు 'గొడ్డలిపార్టీ' వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. తమపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, రాష్ట్రపతి పాలన అంటూ కొత్త నాటకానికి తెరతీయడం రాజకీయ కపటత్వమని దుయ్యబట్టారు.

**ఇప్పుడు కూడా అదే తరహాలో వివాదాలు**

గత ఎన్నికల సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరును ప్రజలు చూశారని, ఇప్పుడు కూడా అదే తరహాలో వివాదాలు సృష్టించి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు, గత ఐదేళ్ల తమ పాలనలో వ్యవహరించిన తీరుపై వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

**నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ వేసేలా, ప్రతి ఓటరు భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దని, వాస్తవాలను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు'

## జిల్లాలో ఎంపీటీసీ,జెడ్‌పిటిసి ఎన్నికల

# నిర్వహణకు సర్వం సిద్ధం

**-మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత**



**మార్కాపురం,జిల్లా బ్యూరో, డ్రీమ్ టైమ్స్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం మార్కాపురం జిల్లాలో 2వ సాధారణ ఎంపీటీసీ మరియు జెడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎం.సి.సి) తక్షణమే అమల్లోకి వచ్చిందని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రాతిపదికన, పేపర్ బ్యాలెట్ ద్వారా ఈ ఎన్నికలు నిర్వహించబడుతాయని, ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జెడ్‌పిటిసి ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు ఉపయోగించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ మేరకు ?ఎన్నికల ముఖ్యమైన షెడ్యూల్ వివరాల్లోకి వెళ్తే..ఎన్నికల నోటిఫికేషన్ జారీ 19.10.2026 తేదీన మరియు ?రిటర్నింగ్ అధికారి ద్వారా ఎన్నికల నోటీసు 21.10.2026 న జారీ చేస్తారని వుంటుందన్నారు.నామినేషన్ల స్వీకరణ 21.10.2026 నుండి 23.10.2026 వరకు జరిగుతుందన్నారు.?నామినేషన్ల పరిశీలన: 24.10.2026 ఉంటుందన్నారుతిరస్కరించిన నామినేషన్లపై అప్పీలు చేయుటకు: 25.10.2026 వరకు మరియు ?అప్పీళ్ల పరిష్కారం: 26.10.2026 తేదీన, ?నామినేషన్ల ఉపసంహరణకు మరియు పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా విడుదలకు 27.10.2026 న చివరి తేదీ అని తెలిపారు.

పోలింగ్ నిర్వహణ..తేదీ 03.11.2026 న ఉదయం నుండి సాయంత్రం వరకు మరియు ?రీ-పోలింగ్ (అవసరమైతే) 04.11.2026 న

ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన: 05.11.2026 న ఉంటుందన్నారు.?పరోక్ష ఎన్నికల ప్రత్యేక సమావేశం (ఎంపీపీ, జడ్‌పిపి చైర్‌పర్సన్‌ల ఎన్నిక): 11.11.2026 మరియు 12.11.2026 తేదీలలో వుంటుందన్నారు.

జిల్లా నియోజకవర్గాల గణాంకాలు,రిజర్వేషన్ల వివరాలు, జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన స్థానాలు మరియు రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

జెడ్‌పిటిసి స్థానాలు (మొత్తం 21): ఎస్‌టి - 1 (మహిళ), ఎస్‌సి - 5 (3 మహిళలు), బీసీ - 4 (2 మహిళలు), యు.ఆర్ / జనరల్ - 11 (5 మహిళలు).,?మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) స్థానాలు (మొత్తం 21): ఎస్‌టి - 1, ఎస్‌సి - 5 (3 మహిళలు), బీసీ - 4 (2 మహిళలు), యు.ఆర్ / జనరల్ - 11 (5 మహిళలు).,?ఎంపీటీసీ స్థానాలు (మొత్తం 274): ఎస్‌టి - 10 (3 మహిళలు), ఎస్‌సి - 63 (29 మహిళలు), బీసీ - 60 (28 మహిళలు), యు.ఆర్ / జనరల్ - 141 (74 మహిళలు).

**పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు మరియు లాజిస్టిక్స్:**

మొత్తం ఓటర్లు: 7,46,030 మంది. ఇందులో పురుషులు 3,77,161, మహిళలు 3,68,843 మరియు ఇతరులు/ట్రాన్స్‌జెండర్లు 26., ?పోలింగ్ కేంద్రాలు (మొత్తం 982): సాధారణ కేంద్రాలు - 435, సమస్యాత్మక కేంద్రాలు - 287, అత్యంత సమస్యాత్మక కేంద్రాలు - 260., ?బ్యాలెట్ బాక్సులు: స్థానికంగా అందుబాటులో ఉన్న 737 మరియు ప్రకాశం జిల్లా నుండి తెప్పించిన 450 కలిపి మొత్తం 1,187 బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోలింగ్ సిబ్బంది : ప్రతి కేంద్రానికి 5 మంది చొప్పున 982 కేంద్రాలకు 4,910 మంది సిబ్బంది, మరియు 10% రిజర్వ్ కింద 491 మందితో కలిపి మొత్తం 5,401 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీరితో పాటు 65 మంది జోనల్ అధికారులు, 132 మంది రూట్ అధికారులను కూడా నియమించారు.

**ప్రత్యేక ఏర్పాట్లు మరియు పర్యవేక్షణ ?నామినేషన్ల కేంద్రాలు:**

ఎంపీటీసీ నామినేషన్లు సంబంధిత మండల ప్రజా పరిషత్ కార్యాలయాలలో లేదా రిటర్నింగ్ అధికారులు కేటాయించిన ప్రత్యేక భవనాలలో, జెడ్‌పిటిసి నామినేషన్లు జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించబడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.?

**కంట్రోల్ రూమ్‌లు:**

ఎన్నికల పర్యవేక్షణ కోసం జిల్లా పరిషత్ కార్యాలయంలో మరియు అన్ని మండల కేంద్రాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, ఎలక్షన్ సెల్స్ ఏర్పాటు చేశామన్నారు.

**దివ్యాంగ ఓటర్లకు వసతులు:**

పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగ ఓటర్ల సౌకర్యార్థం మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు మరియు పోలింగ్ కేంద్రాల వద్ద తగినన్ని వీల్‌చైర్లు అందుబాటులో ఉంచామన్నారు.

**నిఘా బృందాలు:**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించడానికి ఎం.సి.సి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, మరియు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ నిరంతరం పనిచేస్తాయని పేర్కొన్నారు.?ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు మరియు అధికారులు అందరూ పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత విజ్ఞప్తి చేశారు.

## లింగారెడ్డిగూడ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా గ్రామానికి దీపాల వెలుగులు

**- మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**దాదాపు రూ.6 లక్షల వ్యయంతో మూడు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డ్రీమ్ టైమ్స్**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా గ్రామానికి దీపాల వెలుగులు నింపారు. మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాదాపు రూ. 6 లక్షల వ్యయంతో మూడు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేశారు. లింగారెడ్డి గూడ గ్రామంలో దసరా పండుగ శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే లాంఛనంగా అట్టహాసంతో వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. గ్రామంలో వెలుగులు నింపేందుకు దాదాపు రూ. 6 లక్షల వ్యయంతో ఈ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఫరూక్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ అంజయ్య గౌడ్, భాస్కర్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, రమేష్ గౌడ్, భూపతి రెడ్డి, శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులు సాయి వెంకటేష్ గౌడ్, వీరేష్ గౌడ్, మంగలి మల్లేష్, నరేందర్ రెడ్డి, అంజయ్య గౌడ్, బక్కడి నరేష్, బొల్లు కుమార్, వెంకటేష్ యాదవ్, నారాయణ గౌడ్, గంటిల శంకరయ్య, ప్రతాపరెడ్డి, బాదేమియా, సున్నాల రాజశేఖర్, బాలనగర్ సురేష్ గౌడ్, దేవగిరి శేఖర్, షాబాద్ జంగయ్య, గోద జంగయ్య, షాబాద్ శంకరయ్య, శివకుమార్, దేవా, శీను యాదవ్, రంగంపల్లి నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, రామకృష్ణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతుల కష్టాలు తీరాలి.. పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా ఉండాలి

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-ఎలికట్ట భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రవీందర్ యాదవ్**

**-హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీఆర్ఎస్ శ్రేణులు**



**రంగారెడ్డి జిల్లా డ్రీమ్ టైమ్స్ :**
ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని భవానీమాత దేవాలయం శరన్నవ రాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీమాతను దర్శించుకుని భక్తితో మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రైతులు పండించిన పంటలకు తగిన గిట్టుబాటు లభించాలని ఆకాంక్షించారు. పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా ఉండాలని, రైతుల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలని ప్రార్థించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నిండాలని భవానీమాతను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ దంపతులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, సర్పంచులు గీత వీరేశం, జెట్ట కుమార్, రమేష్ యాదవ్, కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, గోపాల్, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు యుగంధర్, జూపల్లి శంకర్, నందకిషోర్, ఎలికట్ట దేవాలయ మాజీ చైర్మన్ ముత్యాల రాజు, నాయకులు సంజీవయ్య, రవి యాదవ్, మల్లేష్, మంగలి శ్రీశైలం, పురుగుల సురేష్, దినేష్ రెడ్డి, కృపత్ రెడ్డి, పిట్టల రాజు, బీఆర్ఎస్ యువకులు, తదితరులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 'స్క్రూటినీ'ని ఖచ్చితంగా నిర్వహించాలి..

**-జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

**-ఎటువంటి అవతవకులకు పాల్పడరాదు**

**-ఎలక్షన్ అధికారులకు దిశా నిర్దేశం**





**ఒంగోలు, ప్రకాశం డ్రీమ్ టైమ్స్**
నామినేషన్' పత్రాల 'స్క్రూటీనీ'పై జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలసి ఆర్వోస్, ఏఆర్వోలు ఎలక్షన్ ఆఫీసర్లు మరియు అడిషనల్ ఎలక్షన్ ఆఫీసర్లకు కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యల గురించి విపులంగా చర్చించారు. స్క్రూటిని ని ఖచ్చితంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు మేరకు స్క్రూటినీని నిర్వహించాలని, ఎటువంటి అవతవకులకు పాల్పడరాదని అని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. స్కూటీ అనే ప్రక్రియ చట్టబద్ధంగా, జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఇందులో అలసత్వం వహించిన సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

# బిజినెస్

# యెజ్డీ బైకులపై ప్రత్యేక ఆఫర్లు

**-100 శాతం ఫైనాన్స్ సదుపాయం.. జీరో డౌన్‌పేమెంట్**

**-5.99 శాతం ప్రారంభ వడ్డీ రేటుతో కొనుగోలు చేసే అవకాశం**




**ముంబై**

యెజ్డీ మోటార్‌సైకిళ్ల కొనుగోలుదారుల కోసం కంపెనీ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ పండుగ సీజన్‌లో యెజ్డీ బైక్‌లను కొనుగోలు చేసే వారికి 100 శాతం ఫైనాన్స్ సదుపాయాన్ని అందిస్తోంది. దీంతో పాటు జీరో డౌన్‌పేమెంట్ వెసులుబాటును కల్పిస్తోంది. అర్హత కలిగిన వినియోగదారులు 5.99 శాతం ప్రారంభ వడ్డీ రేటుతో బైక్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ ఆఫర్లతో ఒకేసారి పెద్ద మొత్తాన్ని చెల్లించకుండా బైక్ కొనాలనుకునే వారికి ప్రయోజనం కలగనుంది. అయితే ఫైనాన్స్ అర్హతలు, వడ్డీ రేటు, రుణ నిబంధనలు ఆర్థిక సంస్థను బట్టి మారవచ్చు. కొనుగోలు చేసే ముందు వర్తించే నిబంధనలను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# త్వరలో మార్కెట్లోకి పోకో ఎక్స్8ఎస్

**-స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్ ఉండే అవకాశం**

**-12 జీబీ ర్యామ్, ఆండ్రాయిడ్ 16తో రానున్నట్లు లీకులు**

**-120 హెర్ట్జ్ డిస్‌ప్లే, 50 మెగాపిక్సెల్ కెమెరా ఉండొచ్చని సమాచారం**

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ పోకో నుంచి కొత్తగా ఎక్స్8ఎస్ మోడల్ విడుదలయ్యే అవకాశం ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ఫోన్ మోడల్ నంబర్ 2609జ్రూజ5ఖీ+ థాయ్‌లాండ్‌కు చెందిన ఎన్‌బీటీసీ ధ్రువీకరణ వెబ్‌సైట్‌లో కనిపించినట్లు సమాచారం. దీంతో ఈ ఫోన్ త్వరలో మార్కెట్లోకి వచ్చే అవకాశాలపై స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఫోన్ విడుదల తేదీ, ధర, ఇతర వివరాలపై కంపెనీ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. లీకుల ప్రకారం పోకో ఎక్స్8ఎస్‌లో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్‌ను అందించే అవకాశం ఉంది. దీనికి 12 జీబీ ర్యామ్, ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టమ్ జతకావచ్చని అంచనా. ఈ వివరాలు నిజమైతే వేగవంతమైన పనితీరుతోపాటు ఒకేసారి పలు యాప్‌లను వినియోగించుకునే వారికి ఈ ఫోన్ ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6.83 అంగుళాల డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్ ఉండవచ్చని ప్రాథమిక సమాచారం సూచిస్తోంది. అలాగే 50 మెగాపిక్సెల్ కెమెరాను కూడా అందించే అవకాశం ఉందని లీకులు పేర్కొంటున్నాయి. అయితే కెమెరా పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, ఛార్జింగ్ వేగం, నిల్వ సామర్థ్యం వంటి కీలక వివరాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ప్రస్తుతం ఈ ఫోన్‌కు సంబంధించిన సమాచారం ధ్రువీకరణ వెబ్‌సైట్‌లో మోడల్ నంబర్ కనిపించడం, లీకుల ఆధారంగానే వెలుగులోకి వచ్చింది. పోకో సంస్థ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ఫీచర్లను ఖరారైన వివరాలుగా పరిగణించలేం. విడుదల తేదీ, ధర, పూర్తి స్పెసిఫికేషన్లపై కంపెనీ ప్రకటన వెలువడిన తర్వాతే మరింత స్పష్టత రానుంది.




# ధన్‌తేరస్ వేళ బంగారం కొంటున్నారా?

**-ఆచారం కోసం కొనుగోళ్లా.. పెట్టుబడి కోసమా?**

**-తయారీ ఖర్చులు, ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకోండి**

**-తొందరపాటు నిర్ణయాల కంటే ఆర్థిక ప్రణాళికే ముఖ్యం**

ధన్‌తేరస్, దీపావళి పండుగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం చాలామందికి ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగల వేళ బంగారం కొంటే శుభప్రదమని భావించి ఆభరణాలు, నాణేలు కొనుగోలు చేస్తుంటారు. అయితే పండుగ సంప్రదాయం కోసం బంగారం కొనడం, దీర్ఘకాలిక పెట్టుబడిగా కొనుగోలు చేయడం రెండూ వేర్వేరు అంశాలని గుర్తుంచుకోవాలి. కొనుగోలు చేసే ముందు తమ ఆర్థిక పరిస్థితిని, అవసరాలను అంచనా వేసుకోవడం అవసరం. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు వాటి ధరతోపాటు తయారీ ఖర్చులు, వర్తించే పన్నులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆభరణాలను తిరిగి విక్రయించే సమయంలో తయారీ ఖర్చుల మొత్తం తిరిగి రాకపోవచ్చు. అందువల్ల ఆభరణాల కొనుగోలును పెట్టుబడితో సమానంగా చూడకూడదు.



పెట్టుబడి కోసం బంగారం కొనాలనుకునేవారు తమ లక్ష్యాలు, పెట్టుబడి కాలపరిమితి, ఇతర ఆర్థిక బాధ్యతలను పరిశీలించాలి. ఆదివారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్థిరంగా ఉన్నట్లు సమాచారం. అయితే ధరలు స్థిరంగా ఉన్నాయనే కారణంతో వెంటనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. మార్కెట్ పరిస్థితులు, ధరల హెచ్చుతగ్గులు, వ్యక్తిగత ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి. ఇతరులు కొనుగోలు చేస్తున్నారని లేదా సంప్రదాయం పాటించాలనే ఉద్దేశంతో అప్పు చేసి బంగారం కొనడం వంటి నిర్ణయాలకు దూరంగా ఉండటం మంచిది. మొత్తంగా ధన్‌తేరస్ సందర్భంగా బంగారం కొనుగోలు చేయాలనుకునేవారు తమ బడ్జెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అత్యవసర ఖర్చులు, భవిష్యత్తు అవసరాలకు సరిపడా నిధులు ఉంచుకున్న తర్వాతే కొనుగోలు గురించి ఆలోచించాలి. పండుగ ఆనందంతోపాటు ఆర్థిక భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం శ్రేయస్కరం.

# స్పోర్ట్స్

# టీమిండియాకు కొత్త అస్త్రం..

**-ఆల్‌రౌండర్‌గా నమన్ ధీర్ మెరుపులు!**

**-ఆరు బంతుల్లో 24 పరుగులతో విధ్వంసం.. బౌలింగ్‌లోనూ సత్తా**

**-విండీస్‌తో సిరీస్‌లో ఆకట్టుకున్న యువ ఆటగాడు**

వెస్టిండీస్‌తో టీ20, వన్డే సిరీస్ ద్వారా.. టీమిండియా ఓ సరికొత్త ఆయుధాన్ని కనిపెట్టింది. అతడే నమన్ ధీర్ . బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతున్న ఈ 26 ఏళ్ల సంచలనం టీమిండియాలో కీలక ఆటగాడిగా మారిపోతున్నాడు. ఆడింది తక్కువ మ్యాచులే అయినా.. తన సత్తాతో టాప్ క్లాస్ ఆటగాళ్లకు సైతం పోటీ ఇస్తున్నాడు.బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆఖరి టీ20లో నమన్ చూపించిన హిట్టింగ్ విధ్వంసం అందరినీ ఆశ్చర్యపరిచింది. 9 ఓవర్ల మ్యాచ్‌లో సీనియర్ శివం దూబే కంటే ముందే క్రీజులోకి వచ్చిన నమన్, ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. కీమో పాల్, షమర్ స్ప్రింగర్ వంటి ఫాస్ట్ బౌలర్ల బౌలింగ్‌లో కేవలం 6 బంతుల్లోనే 3 సిక్సర్లు, 1 ఫోర్‌తో ఏకంగా 400 స్ట్రైక్ రేట్‌తో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ప్రదర్శించిన పవర్ హిట్టింగ్ సత్తాను అంతర్జాతీయ వేదికపై కూడా ప్రదర్శిస్తున్నాడు.అయితే నమన్ ధీర్ కేవలం బ్యాటింగ్‌కే పరిమితం కాలేదు. వాషింగ్టన్ సుందర్ స్థానంలో చివరి నిమిషంలో జట్టులోకి వచ్చినప్పటికీ, తన ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తోనూ అకట్టుకున్నాడు. వన్డే సిరీస్‌లో ఓవర్‌కు 6.30 రన్స్ మాత్రమే ఇచ్చి కుల్దీప్ యాదవ్ తర్వాత అత్యుత్తమ ఎకానమీ సాధించాడు. టీ20 సిరీస్‌లో విండీస్ పవర్ హిట్టర్లు అతడి బౌలింగ్‌లో సిక్సర్లు బాదినప్పటికీ, తర్వాత బంతికే వికెట్ పడగొట్టాడు. ఇలా ఐదు వికెట్లు తీశాడు. సిక్స్ పడిన తర్వాత ఒత్తిడికి గురికాకుండా వికెట్ తీసే అతడి వైఖరిని వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీ సైతం ప్రత్యేకంగా ప్రశంసించాడు.నమన్ ధీర్ తన బౌలింగ్‌లో వేగాన్ని మార్చడంలో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బంతులు విసురుతూ విండీస్ కుడిచేతి వాటం బ్యాటర్లను బోల్తా కొట్టించాడు. లక్నో టీ20లో షై హోప్, రొమారియో షెఫర్డ్ వంటి డేంజరస్ బ్యాటర్లను తన స్మార్ట్ వేరియేషన్లతో పెవిలియన్ పంపాడు. మ్యాచ్ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు కూడా బౌలింగ్ చేయడానికి అతడు చూపించిన ధైర్యం, ఆటిట్యూడ్‌ను భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కొనియాడాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో ఎంతో శ్రమించి సాధించిన అనుభవం అతడి బౌలింగ్‌లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం భారత జట్టులో లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు సాధించే ఫినిషర్ల కొరత ఉంది. హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలు, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడుతున్న తరుణంలో నమన్ ధీర్ ఆ స్థానానికి సరైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నాడు. పేస్, స్పిన్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కోగల సత్తా నమన్ సొంతం. తాను జెన్యూన్ ఆల్‌రౌండర్‌గా మారడమే లక్ష్యమని, అయితే బ్యాటింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు. ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్ రెండింట్లోనూ రాణిస్తున్న నమన్ ధీర్ రాబోయే రోజుల్లో టీమిండియాకు అత్యంత కీలకమైన ఆస్తిగా మారతాడని క్రీడా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.








# హైదరాబాద్ 275 ఆలౌట్

విజయవాడ :
ఆంధ్రతో రంజీ ట్రోఫీ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తక్కువ స్కోరుకే పరిమితం అయింది. ఆదివారం మొదలైన గ్రూప్-బీ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిరాజ్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (67), తన్మయ్ అగర్వాల్ (42) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించి మంచి పునాది వేసినా ఈ జోడీ విడిపోయిన తర్వాత హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో రాహుల్ రాదేశ్ (58 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో విజయ్ 4, లలిత్ మోహన్, సౌరభ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఆంధ్ర తొలి రోజు చివరకు వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది.

గిల్ ఒక్క పరుగుకే ఔట్

న్యూజిలాండ్ పర్యటనకు ముందు పంజాబ్ జట్టు తరఫున రంజీ బరిలో నిలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1) నిరాశ పరిచాడు. ఛత్తీస్‌గఢ్‌తో మొదలైన మ్యాచ్‌లో ఐదు బంతులాడి ఒకే పరుగు చేసిన అతను లెఫ్టార్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. గిల్ ఫెయిలైనా ఉదయ్ సహరన్ (106 బ్యాటింగ్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (62) సత్తా చాటడంతో పంజాబ్ తొలి రోజు ఆటను 269/4తో ముగించింది.

# అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం

**ప్రారంభ వేడుకల్లో ర పత్యేక ఆకర్షణగా భారత బృందం**

నగోయా (జపాన్):
ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు. భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్‌లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నాడు.





## కుర్రభామలకు గట్టిపోటీ ఇస్తున్న త్రిష

# ప్రశాంత్ నీల్ మూవీ సరికొత్త ప్రయోగం..

### -అర్ధరాత్రి ప్రీమియర్లతో ప్రేక్షకుల ముందుకు '418'!




వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కుతున్న సంచలన హారర్ చిత్రం '418'. ట్రెండింగ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తెలుగు తెరపై ఇప్పటివరకు ఎన్నడూ చూడని సరికొత్త కథాంశంతో, సరికొత్త భయానక వాతావరణంలో ఈ సినిమాను రూపొందించారు. హారర్ చిత్రాల జోనర్‌కు సరికొత్త నిర్వచనం ఇచ్చేలా ఈ సినిమా ఉంటుందని, థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని సినీ వర్గాల్లో గట్టి చర్చ జరుగుతోంది.అయితే ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. కాగా.. ఈ సినిమాను అక్టోబర్ 22వ తేదీన లేట్ నైట్ ప్రీమియర్లతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అర్ధరాత్రి సమయంలో భయానక చిత్రాలు చూస్తూ అసలైన థ్రిల్ అనుభవించాలనుకునే సినీ ప్రియుల కోసం ఈ ప్రత్యేక రాత్రి షోలను ఏర్పాటు చేయడం విశేషం. ఆ తర్వాత అక్టోబర్ 23న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. ప్రశాంత్ నీల్ మార్క్ మేకింగ్ స్టైల్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయని, బాక్సాఫీస్ వద్ద ఇది ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అక్క' టీజర్‌తో ఆసక్తి రేపుతున్న కీర్తి సురేశ్..

### -రాధికా ఆప్టేతో హోరాహోరీ పోరు!




ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు మరో ఆసక్తికరమైన వెబ్ సిరీస్ సిద్ధమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందించిన 'అక్క' టీజర్ తాజాగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కథానాయికలు కీర్తి సురేశ్, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇద్దరు బలమైన మహిళా పాత్రల మధ్య సాగే పోరాటం ఈ సిరీస్‌పై అంచనాలను పెంచుతోంది.సాధారణంగా కమర్షియల్ కథల్లో హీరో, విలన్ మధ్య జరిగే పోరాటమే ప్రధానంగా కనిపిస్తుంది. అయితే 'అక్క' మాత్రం అందుకు భిన్నంగా ఇద్దరు శక్తిమంతమైన మహిళా పాత్రల మధ్య సంఘర్షణను ప్రధానంగా చూపించబోతున్నట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. విభిన్న వ్యక్తిత్వాలు కలిగిన ఈ ఇద్దరి మధ్య ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? వారి మధ్య పోరుకు కారణమేంటి? అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.ఈ సిరీస్‌లో కీర్తి సురేశ్ మునుపెన్నడూ చూడని విధంగా ఆవేశభరితమైన పాత్రలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఆమె లుక్, హావభావాలు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. మరోవైపు రాధికా ఆప్టే కూడా తనదైన నటనతో ప్రత్యేకతను చాటుతున్నారు. ఇద్దరి మధ్య సాగే ముఖాముఖి సన్నివేశాలు టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఆసక్తికరమైన కథాంశం, బలమైన నటీనటుల ఎంపికతో 'అక్క' ఇప్పటికే ప్రేక్షకుల్లో చర్చకు దారితీసింది. ఈ వెబ్ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. టీజర్‌లో చూపించిన సంఘర్షణను పూర్తి కథలో ఎలా ఆవిష్కరిస్తారో చూడాలి. కీర్తి సురేశ్, రాధికా ఆప్టే కలిసి తెరపై ఎలాంటి ప్రభావం చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, సాధారణ కథలకు భిన్నంగా ఇద్దరు మహిళల మధ్య సాగే పోరాటాన్ని కేంద్రంగా చేసుకున్న 'అక్క' టీజర్‌తోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. విడుదల తర్వాత ఈ సిరీస్ ఎలాంటి స్పందన అందుకుంటుందో వేచి చూడాలి.

# జ్ఞాపకాల వెల్లువలో హైకూ



ఏగన్, 'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహించారు. డి.అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మాతలు. విలేకరులో సమావేశంలో కథానాయిక శ్రీదేవి మాట్లాడుతూ..తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రమిదని, ప్రేమలోని సంఘర్షణ, మధుర జ్ఞాపకాలను ఆవిష్కరిస్తుందని చెప్పింది. నిజాయతీతో కూడిన ప్రేమకథ ఇదని, కాలేజీ జీవితంలోని అందమైన అనుభవాల్ని చూపించారని కోన వెంకట్ తెలిపారు. తమిళంలో మాదిరిగానే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉందని హీరో ఏగెన్ పేర్కొన్నారు.

# ధర్మన్‌లో రజనీకాంత్ జోడీగా?

ఇప్పటివరకు వీరిద్దరు కలసి చంద్రముఖి, కుసేలన్, దర్బార్, అన్నాత్తే వంటి చిత్రాల్లో నటించారు. తాజా సమాచారం ప్రకారం రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్'లో నయనతార ఓ కీలక పాత్రను పోషించబోతున్నట్లు తెలిసింది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో అగ్ర హీరో కమల్‌హాసన్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది.స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమాలో నయనతారను ఓ కీలక పాత్రకోసం ఎంపిక చేశారని, కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత రజనీకాంత్ చిత్రంలో నయనతార నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో సిమ్రాన్, రాశీఖన్నా, శ్రీలీల, రామ్ పోతినేని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే.



# ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..

### 'స్పిరిట్' నుంచి కొత్త పోస్టర్, రిలీజ్ డేట్ వచ్చేసింది

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'స్పిరిట్' (రాజూఅతీత్). ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ మరియు అప్‌డేట్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఎప్పుడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ప్రభాస్ బ్లాక్ క్యాప్, స్టైలిష్ గాగుల్స్‌తో అత్యంత రగ్డ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నారు.దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మార్క్ యాక్షన్ అండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా, ఈ మూవీపై ఇప్పటికే సినిమా సర్కిల్స్‌లో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించి అభిమానులకు మెగా ట్రీట్ అందించింది. ఈ భారీ యాక్షన్ డ్రామాను 2027 దీపావళి కానుకగా అక్టోబర్ 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన టాలెంటెడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు టీ-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సందీప్ రెడ్డి వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో 'స్పిరిట్'పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. సరికొత్త యాక్షన్ ప్యాక్డ్ కథాంశంతో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.




Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831